ప్రభుత్వ భూమి ఆక్రమణ, రిజిస్ట్రేషన్

- స్పందనలో ఫిర్యాదు
- సర్వే చేసి ప్రభుత్వ స్థలంగా గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం

విశాలాంధ్ర - పాయకరావుపేట: ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని నిర్మాణాలు చేస్తున్నారని ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు స్పందించారు. సర్వే చేసి ఆక్రమణకు గురైనట్లుగా గుర్తించి, ఆక్రమణదారులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని దుర్గా కాలనీలోని దుర్గాదేవి అమ్మవారి ఆలయ సమీపంలో సర్వే నెంబరు 65లోని (పోరంబోకు పాటికొండ) ప్రభుత్వ భూమి ఆక్రమణ చేసి నిర్మాణాలు చేస్తున్నారంటూ పట్టణానికి చెందిన పదాల లోవదొర ఇటీవల స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్ కె.జయప్రకాష్ తన సిబ్బందితో సర్వే నిర్వహించారు. సుమారు 333 గజాలు ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురై, రిజిస్ట్రేషన్ చేయించుకొని, అందులో నిర్మాణాలు చేస్తున్నట్లు, బోరు నిర్మించినట్లు తహశీల్దార్ గుర్తించారు. ఈమేరకు ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ స్థలం అంటూ హెచ్చరిక బోర్డులు పెట్టారు. అయితే ఆక్రమణదారులు బోర్డులు తొలగించి, నిర్మాణాలు ప్రారంభించారు. దీంతో దండెం శివకుమార్, దండెం రాజబాబు అనే వారు ప్రభుత్వ స్థలం ఆక్రమించుకున్నారని, అందులో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించారని తహశీల్దార్ కె.జయప్రకాష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు 1982 భూకబ్జా నిషేద చట్టం కింద దండెం శివకుమార్, దండెం రాజబాబులపై 447, 427 రెడ్‌విత్ 34, 4 సెక్షన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జోగారావు తెలిపారు.

వారపుసంతల్లో పీడీఎస్ బియ్యం విక్రయాలు

విశాలాంధ్ర - పాడేరు: ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులకు పంపిణీ చేస్తున్న కిలో రూపాయి బియ్యం విక్రయాలు వారపు సంతలలో జోరుగా జరుగు తున్నాయి. ఏజెన్సీలో జరిగే వారపు సంతల్లో మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు పీడీఎస్ బియ్యాన్ని యధేచ్ఛగా కొనుగోలు చేస్తున్నారు. మండలంలోని గుత్తులపుట్టు గ్రామంలో ప్రతి గురువారం నిర్వహించే వారపు సంతలో పీడీఎస్ బియ్యాన్ని బహిరంగంగానే మైదాన ప్రాంత వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పీడీఎస్ బియ్యం సుమారుగా ఐదు నుంచి, ఆరు టన్నుల వరకు కొనుగోలు చేస్తూ మైదాన ప్రాంతాలకు తరలించుకుపోతున్నారు.

నల్ల బజార్లు పీడీఎస్ బియ్యం

మైదాన ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు వారపు సంతలో పీడీఎస్ బియ్యాన్ని కిలో 12 నుంచి 15 రూపాయలు వరకు కొనుగోలు చేస్తున్నారు. పీడీఎస్ రైస్‌ను వ్యాపారులు వాహనాలలో నల్ల బజార్లకు తరలిస్తున్నారు. పిడిఎస్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో తరలించి కిలో బియ్యం 30 నుంచి 35 రూపాయలు వరకు బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. బియ్యాన్ని రైస్ మిల్లులకు తరలించి రైస్ పాలిష్ చేసి, పిడిఎస్ రైస్‌ను బిపిటి రైస్‌గా మార్చేసి అధిక ధరలకు విక్రయాలు జరుపుతున్నారు.

చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

వారపు సంతలలో పిడిఎస్ బియ్యం పెద్దఎత్తున నల్ల బజార్లకు తరలిపోతున్న ప్రభుత్వ ప్రజాపంపిణీ, రెవెన్యూ అధికార యంత్రాంగం అరికట్టేందుకు చర్యలు చేపట్టకుండా చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ప్రజా పంపిణీ అధికారులు, రెవెన్యూ అధికారులు స్పందించి వారపు సంతల నుంచి పిడిఎస్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రుషికొండను ధ్వంసం చేసే అధికారం ఎవరిచ్చారు..?

పోలీసుల తీరుతో ప్రజలకు తీవ్ర ఇక్కట్లు
టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రుషికొండను ధ్వంసం చేసే అధికారం ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని, పోలీసుల తీరుతో ప్రజలకు తీవ్ర ఇక్కట్లు ఎదురవుతున్నాయని టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ అన్నారు. శనివారం విశాఖ జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ రుషికొండ పరిరక్షణకు తాము పిలుపునిస్తే 2,500 మంది పోలీసులను పెట్టారని అన్నారు. సెక్షన్ 30 అమల్లో వుందని రుషికొండకు వెళ్లొద్దని పోలీసుల నిర్బంధం సరైంది కాదన్నారు. టూరిజం ప్రాజెక్టు ఆగిపోతోందని పోలీసులు చెప్పడం చూస్తుంటే ఆ ప్రాజెక్టును పోలీసులు ఆపుతారా అని ప్రశ్నించారు. జోడుగుళ్ల పాలెం నుంచి రుషికొండ వరకూ, తిమ్మాపురం నుంచి రుషికొండ వరకూ సంచారాన్ని ఆపేశారని, పోలీసుల నిబంధనల వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని అన్నారు. ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపే హక్కే లేనపుడు ఎగ్జిక్యూటివ్ రాజధాని వచ్చి ఉపయోగం ఏంటిని ప్రశ్నించారు. రుషికొండను బ్లూ ఫ్లాగ్ బీచ్ కింద గుర్తించనపుడు ప్రజామోదం లేకుండా ఎలా తవ్వకాలు జరిపారో వివరణ ఇవ్వాలని, ఎగ్జిక్యూటివ్ రాజధానిగా విశాఖను చేయడానికి చట్టం ఏమైనా వుందా అన్నారు. శాశనం లేకుండా ఎలా నిర్మాణాలు మొదలు పెడతారని, ఇది ఒక అభూత కల్పన మాత్రమేనన్నారు. శాంతి యుతంగా చేపట్టే ఏ నిరసననైనా అడ్డుకోవద్దు అని, తీరు మార్చుకోకపోతే వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి నజీర్ మాట్లాడుతూ నిన్నటి సంఘటనతో పోలీసులు మరోసారి వైసిపికి సేవకులుగా మారిపోయారని రుజువు చేశారన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ, విశాఖ అధికార ప్రతినిధి ఆళ్ల శ్రీనివాస్‌రావు, వలిశెట్టి తాతాజీ, పొడుగు కుమార్, నడి గుట్టల్లా శంకర్రావు, కోనేటి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకులు కర్రి సూర్య నారాయణ మృతి

విశాలాంధ్ర-అనకాపల్లి: మండలంలోని ఉమ్మలాడ గ్రామ మాజీ సర్పంచ్, సీపీఐ సీనియర్ నాయకులు కర్రి సూర్యనారాయణ (85) మృతి చెందారు. కర్రి సూర్యనారాయణ మాజీ ఎమ్మెల్యే కొడుగంటి గోవిందరావు గెలుపునకు కృషి చేశారు. రైతు సంఘం నాయకులుగా, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులుగా, అనకాపల్లి, మునగపాక, చూచుకొండ, కొండకర్ల గ్రామాల్లో పార్టీ, రైతు సంఘం నిర్మాణం, బలోపేతానికి కృషి చేశారు. ఈయన మృతి వార్తను తెలుసున్న పార్టీ కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వై.ఎన్.భద్రం, మళ్ళ మాధవరావు, రాజాన దొరబాబు నాయుడు, మల్లికార్జునరావు, చెల్లూరి నాగరాజు, తాకాశి వెంకటేశ్వరరావు, కోన లక్ష్మణ, కోరిబిల్లి శంకర్‌రావు, కె.వీరచారి, ఆదారి రామారావు, ప్రజా సంఘాలు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నాగేంద్రుడికి ఎమ్మెల్యే బాబూరావు పూజలు

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో నాగులచవితి వేడుకలు ఘనంగా నిర్వహి ంచారు. మండలంలోని యస్.రాయవరం, చిన్నగుమ్ములూరు, కొరుప్రోలు తదితర గ్రామాల్లో భక్తులు తమ పొలాల్లో పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. కొరుప్రోలు గ్రామంలో పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు దంపతులు నాగులచవితి పూజలు చేశారు.

తల్లి చితి ఆరకముందే కుమారుడు మృతి

అనాథగా మిగిలిన కుమార్తె భూమిక

ఫైల్‌ఫోటో

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: తల్లి చితి ఆరకముందే ఒక్కరోజు వ్యవధిలో కుమారుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో గల దుర్గ వీధిలో చోటుచేసుకుంది. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గంపరాయి పుష్పావతి (40) గురువారం రాత్రి మృతి చెందగా తల్లిని తలుచుకుంటూ ఒక్కరోజు వ్యవధిలోనే కుమారుడు గంపరాయి సాయి కుమార్ (21) శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు చుట్టుప్రక్కల గృహస్తులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఏడాది క్రితం అనారోగ్యం బారిన పడి పుష్పవతి భర్త కృష్ణారావు మృతి చెందిన విషయం విధితమే. ఏడాదిలో ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందడంతో కుటుంబంలో కుమార్తె భూమిక (19) అనాథగా మిగిలింది. అనాథ అయిన కుమార్తె భూమికను ప్రభుత్వం ఆదుకోవాలని దారేలా సర్పంచ్ పాండు రంగస్వామి, బలరాం, శంకర్, ప్రసన్న కుమార్, బాబురావు తదితరులు కోరారు.

కార్పొరేటర్ గుండపు ఆధ్వర్యంలో పాములపై అవగాహన

విశాలాంధ్ర - మల్కాపురం: 40వ వార్డు పరిధిలో గల షిప్‌యార్డు కాలనీలో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పాముల ఆనంద్, నాగరాజు నాగుల చవితి సందర్భంగా పాములపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రకృతిని అందులోని జంతువులను పూజించడం భారతీయులకు అనాదిగా వస్తున్న ఆచారమన్నారు. సమస్త జీవకోటిలో ఈశ్వరుడు ఉన్నాడని విశ్వసిస్తామని, అందులో భాగంగానే పాములను పూజిస్తామని అన్నారు. ముఖ్యంగా దీపావళి అమావాస్య తర్వాత వచ్చే కార్తీక శుద్ధి చవితి నాడు నాగుపాములను కొలుస్తామని, దాన్నే నాగుల చవితి అంటారని అన్నారు.

జగనన్నతోనే సుపరిపాలన సాధ్యం

ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - పాడేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సుపరి పాలన సాధ్యమైందని ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. పాడేరు మండలం లగిశపల్లి గ్రామ సచి వాలయం పరిధిలోని వంజంగి, ఎస్.కొత్తూరు గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 117 గడపలను ఎమ్మెల్యే సందర్శించి పథకాలపై వివరించారు. తన, తమ అనే భేదం లేకుండా అర్హులైన వారందరికీ ఈ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. ఈ కార్య క్రమంలో తాము వెళ్లిన ప్రతి చోటా ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డిపై అపూర్వమైన గౌరవం పెరిగిందని, ఆయన్నే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలనే తపన అందరిలోనూ కనిపిస్తుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంతాల బొంజుబాబు, ఎంపీ టీసీ లకే రామకృష్ణ పాత్రుడు, సర్పంచులు ఎస్.రాంబాబు, వి.రాంబాబు, వి.బసవన్న దొర, ఎల్.పార్వతమ్మ, ఎంపీటీసీ చిట్టెమ్మ, జిల్లా వ్యవ సాయ సలహా మండలి చైర్‌పర్సన్ సరస్వతి, వైసీపీ సీనియర్ నాయకులు ఎస్.మంగ్లన్న దొర, ఎం.కన్నా పాత్రుడు, వి.దశమూర్తి, కె.సూరిబాబు, కె.బొంజుబాబు, వి.సత్య నారాయణ, బి.రాజారావు, కె.సుశీల, ఎల్.సత్య వతి, జి.రాజారావు, బొడరాజు, స్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర - అనంతగిరి: మండలంలోని శివలింగపురం విద్యా క్లస్టర్‌లో 200 మంది పేద విద్యార్థులకు బైబిల్ టబర్నికల్ చర్చి అమెరికా వారి సహాయంతో సమిధ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేసినట్టు కార్యదర్శి దొడ్డి వీరభద్రరావు తెలిపారు. శివలింగపురం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రాంగోపాల్, సీనియర్ ఉపాధ్యాయులు గుజ్జెల కొండబాబు, అప్పలనాయుడు, యూటీఎఫ్ సీనియర్ నాయకులు శెట్టి రాంబాబు, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు వై.జానకి రామ్ నాయుడు, ఉపాధ్యాయులు సమర్ది రాజ్ కుమార్, నరాజి మల్లేశ్వరరావు, బలరాజు, శాంతి, అరుణలు పాల్గొన్నారు. వెనుక బడిన విద్యార్థుల విద్యాభివృద్ధికి సమిధ సంస్థ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సమిధ సంస్థ అధ్యక్షులు పదాల రమణ, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ దీసరి బుద్ధరాజు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

విశాలాంధ్ర - హుకుంపేట: విశాఖ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూప నందేంద్ర సరస్వతీ స్వామిజీ జన్మదినాన్ని పురస్కారించుకుని ఉప్ప, హుకుంపేట ఆస్పత్రిల్లో రోగులకు జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్యలింగం ఆధ్వర్యంలో ఎంపీపీ కూడా రాజుబాబు, ఎస్టీ కమిషన్ సభ్యురాలు జంపరంగి లిల్లిలు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. స్వామిజి గొప్పతనం గురించి రోగులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొండబాబు, వైద్యాధికారిణి డా.సౌమ్య, వైసీపీ పార్టీ సోషల్ మీడియా జిల్లా కో కన్వీనర్ తెడబారికి సురేష్ కుమార్, సర్పంచ్‌లు సమిడ వెంకటపూర్ణిమ, వర్తన ఈశ్వరమ్మ, పుష్పలమ్మ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు అందించేందుకే సచివాలయ వ్యవస్థ ఏర్పాటు

ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత పంచాయతీ ప్రజల వద్దకు సంక్షేమ ఫలాలు అందించాలని సచివాలయం వ్యవస్థ ఏర్పాటు చేసిందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలో వనబసింగి పంచాయితీ కేంద్రంతో పాటు చిప్పాపుట్టు, లుంగాపుటు, తాడ్డపల్లి, తొంగి కోట గ్రామాలలో గడపగడప కార్యక్రమం నిర్వహి ంచారు. 246 గడపలకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. ఇంటి వద్దకే అన్ని పథకాలు అందుతు న్నాయని, అన్ని సమస్యలు పరి ష్కారం అవుతున్నాయని ప్రజలు ఎమ్మెల్యేకు వివరిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, ఎంపీడీవో కిరణ్ కుమార్, ఏపీఓ సూరిబాబు, వైసీపీ మండల అధ్యక్షులు మల్లికార్జున్, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు రమే ష్, నరసింహ రావు, లక్ష్మణ్, ఎంపీటీసీలు సుబ్బ లక్ష్మి, మండల నాయకులు జగబంధు కొండలరావు, జయ దేవ్, సన్యాసిరావు, పులి రాజు, అప్పారావు, ఉదయ్ ప్రసాదరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నారాయణ కాలేజీలో ఇంటర్మీడియట్ విద్యార్థి ఆత్మహత్య

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం వెల్లంకి గ్రామ పంచాయతీలో నారాయణ కాలేజ్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న పొట్నూరి ముఖేష్ (16) హాస్టల్‌లో శు క్రవారం రాత్రి ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు పార్వతీపురం జిల్లా వీరఘట్టం మండలం, తొట్టంగి గ్రామానికి చెందినవాడు. నాగుల చవితి సందర్భంగా తోటి విద్యార్థులంతా ఇంటికి వెళ్ళిపోయారు. అయితే విద్యార్థి ఇంటికి వస్తానని తల్లికి ఫోన్ చేయగా పండగ చేసుకోవడం లేదని రావద్దని చెప్పడంతో మనస్తాపంనకు గురై మృతి చెందినట్టు తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి పొట్నూరు లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు ఆనందపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ రామచంద్రరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర-పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన ఉద్యోగ మేళాలో 79 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలు సంపాదించినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఎన్.ఈ. ఫ్లోరా తెలిపారు. ఆలివ్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ ఎస్ రామకృష్ణ, ఉన్నత భారత అభియాన్ కోఆర్డినేటర్ ప్రో. పావని మెగా జాబ్ మేళాను నిర్వహించగా, ఇమ్మార్టికస్ కిషోర్, ఆర్పిస సుమంత్, డెక్కన్ సుప్రియ, ట్రైమ్స్ ప్రో.వెంకటేష్, మెయిన్ టెక్ హెచ్‌సిఎల్ ప్రతినిధి దీపక్, అపో లో ఫార్మసీ నాగశేకర్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్ టి.థియో ఫిలస్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాస రావు, ఏవో జి.రవి, ఏరియా స్కిల్ ఆఫీసర్ శ్రీనివాస రావు, ట్రైనింగ్, ప్లేస్మెంట్ సెల్ సిబ్బంది ఫాతిమునిస బేగం, జగదీశ్వరి, కమలారాణి, నాగమణి, అనూష పాల్గొన్నారు.

ఏయూతో ఎన్‌సీసీఆర్ ఎంఓయూ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వ విద్యాలయంలో నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ (ఎన్ సీసీఆర్) అవగాహన ఒప్పందం చేసుకుంది. దీనిలో భాగంగా ఏయూ జువాలజీ విభాగంలో రీసెర్చ్ లాబోరేటరీని ఏర్పాటు చేస్తారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద్ రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ ఎన్ సిసిఆర్ ప్రతినిధులు డాక్టర్ ప్రవకర్ మిశ్రా, డాక్టర్ శివాజి పాత్రలు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, రీసెర్చ్ డెవలప్మెంట్ డీన్ ఆచార్య కె.బసవయ్య, జువాలజీ విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేలలో రైతుల జాబితా ప్రదర్శన

విశాలాంధ్ర - యలమంచిలి రూరల్: యలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో పండించే పంటలను ఈ కర్షక్ యాప్‌లో నమోదు చేసుకున్న ప్రతి రైతుకు ఈకేవైసీ బయోమెట్రిక్ చేయించారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీల కోసం రైతుల జాబితా ప్రదర్శించడం జరిగిందని వ్యవసాయ అధికారి సత్య శ్యామల తెలిపారు. ఈ జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే రైతుల ఆర్బీకేలలో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని తెలిపారు.

108 అంబులెన్సును ప్రారంభించిన బూడి

విశాలాంధ్ర - కె.కోటపాడు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు నూతన 108 అంబులెన్స్‌ను శనివారం ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఆసుపత్రులు, విద్యాలయాలు అభివృద్ధి చెందాయి అన్నారు. అన్ని రకాల సౌకర్యాలతో నూతన టెక్నాలజీని ఉపయోగించి ఈ అంబులెన్స్‌ను తయారు చేయడం జరిగిందన్నారు. ఈ ఆసుపత్రి గతంలో 30 పడకలతో ఉండగా ఇటీవల 50 పడకల ఆసుపత్రిగా స్థాయిని పెంచడం జరిగిందన్నారు. ఇన్ని విధాలుగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంటే విపక్షాలు కావాలని లేని పోని ఆరోపణలు చేస్తున్నా యన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, లంకవానిపాలెం గ్రామ సర్పంచ్ వేచలపు దొరబాబు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శబరిమల భక్తులకు ప్రత్యేక బస్సులు

విశాలాంధ్ర - నర్సీపట్నం: శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని నర్సీపట్నం డిపో మేనేజర్ ధీరజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శబరిమల వెళ్లే భక్తుల కోసం పది రోజుల యాత్రకు రూ.7800, ఎనిమిది రోజులకు రూ.7వేలు, ఐదు రోజులకు రూ.5200 నిర్ణయించామన్నారు. అలాగే కార్తీక మాసంలో పంచరామాలు వెళ్లే వారి కోసం ప్రతీ సోమవారం ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. పల్లె వెలుగు రూ.900, ఎక్స్‌ప్రెస్ బస్సుకు రూ.1150, అల్ట్రా డీలక్స్‌కు రూ.1450 చార్జీలు తీసుకుంటామన్నారు. విజ్ఞాన, విహార యాత్రలకు గ్రూపులుగా వచ్చిన వారికి తక్కువ చార్జీలు నుంచి కండిషన్ గల బస్సులు నడుపుతా మన్నారు. మరిన్ని వివరాలకు 9494811855, 7382916377 నంబర్లకు సంప్రదించాలన్నారు.

ఉక్కు నిర్వాసితుల సమస్యలపై వినతి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ఉక్కు నిర్వాసితుల సమస్యలపై డీటీ విజయలక్ష్మికి టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి వినతి అందించారు. ఆర్ కార్డు ట్రాన్స్‌ఫర్ కోసం రెండేళ్ల నుంచి ఎదురు చూస్తున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. పర్మినెంట్ ఎంప్లాయిమెంట్ కోసం కనీసం మైంటేనన్స్ పని అయినా కల్పించే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెద్దాడ సోము నాయుడు, నామాల పెంటయ్య, పులి సురేష్ రెడ్డి (బాబీ), అప్పారావు, కాకినాడ అప్పల రాజు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన పంచరాత్రుల ఉత్సవాలు

విశాలాంధ్ర - యలమంచిలి: పట్టణంలో పంచరాత్రుల ఉత్సవాలు శనివారంతో వైభవంగా ముగిశాయి. ఐదు రోజుల పాటు పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు భూలోక మాంబ అమ్మవారి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారులను దర్శించుకున్నారు. యలమంచిలి ప్రధాన రహదారితో పాటుగా దిమిలి రోడ్, పాతవీధి, తులసినగర్ రోడ్డులు జనాలతో కిక్కిరిసి పోయాయి. తులసీనగర్‌లోని భూలోకమాంబ అమ్మవారు, పాతవీధిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల వద్ద దీపావళి నుంచి నాగులచవితి వరకు ఈ వేడుకలు జరుపుతుండడం ఆనవాయితీగా వస్తుంది. ఆలయ ధర్మకర్త ఉత్సవ కమిటీ ప్రతినిధులు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు, వైస్ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరంలాగే ఈ సంవ త్సరం కూడా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా దేవతా మూర్తుల వేషధారణలలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఉత్సవాలలో స్థానిక ఏబీ షాపింగ్ మాల్ లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి మున్సిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారి, సిఐ గఫూర్‌లు బహుమతులు అందజేశారు. ఉత్సవాలలో ఎటువంటి అవాంతరాలు జరగకుండా ఇద్దరు సిఐలు, 10 మంది ఎస్సైలు 100 మంది కానిస్టేబుళ్లు, హెూంగార్డులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిఐ షేక్ గఫూర్ మీడియాకి తెలియజేశారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం
జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదాల రమణ

విశాలాంధ్ర - విశాఖ: దేశంలో కోట్లాది మంది భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా నవంబర్ 26, 27, 28 తేదీల్లో రాజమండ్రిలో జరగనున్న భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) 7వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదాల రమణ అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన జిల్లా భవన నిర్మాణ కార్మికుల సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అబద్దాలు అసత్య ప్రచారాలతో అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నదని అన్నారు. తండ్రిని మించిన తనయుడుగా ఉంటానని చెప్పిన జగన్ తండ్రి పెట్టిన పథకానికి తూట్లు పొడిచి రాష్ట్రంలో 50 లక్షల మంది కార్మికుల కడుపులు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల వద్ద నుండి సంక్షేమ బోర్డులో సభ్యత్వం కోసం నిర్మాణ యజమానులు దగ్గర నుండి సెస్ అని వసూలు చేస్తున్న వేల కోట్ల నిధులను అత్త సొమ్ము అల్లుడు దానం లాగా ప్రభుత్వం ఇతర ప్రయోజనలకు మళ్ళించుకుంటున్నా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కష్టజీవులు పక్షపాతి అని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. 2018 నుంచి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాల మాదిరిగానే ప్రభుత్వ పథకాలతో సంబంధం లేకుండా సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కోట సత్తిబాబు, ఎన్. సూర్యనారాయణ, ఎం మోహన్, బి. శ్రీనివాస్, సన్యాసిరావు, వై.ఎస్.మూర్తి, పొన్నాడ సాయి, బి.ప్రతాప్, ఎం. మురళి, కె.వినోద్, బాషా, నాగేశ్వరరావు, ఎం. శ్రీనివాసు, కె. లక్ష్మణరావు, శివారెడ్డి, నూకరాజు, సత్యం, ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో చండక, బోని గ్రామాల్లో అనకాపల్లి సీనియర్ శాస్త్రవేత్త భవాని పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. సాంబామసూరి వరి రకంలో సుడిదోమ ఉధృతిని గమనించారు. ఎకరాకి మోటరోజన్ 120 గ్రాములు, డైనోటేపూరన్ 80 గ్రాములు 200 లీటర్ల నీటిలో నీటిలో కలిపి పిచికారీ చేస్తే వరి పంటను రక్షించుకోవచ్చు అన్నారు. ఇ-పంట నమోదు చేసిన రైతులు వివరాలు మండలంలో రైతు భరోసా కేంద్రాలలో సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించారని చెప్పారు. నమోదులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 31 లోపు రైతు భరోసా కేంద్రంలో మళ్లీ నమోదు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ సంచాలకులు బి.విజయ ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి సంధ్యారత్నప్రభ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ నేత రమణకు పైలా పరామర్శ

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని తురువోలు గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి కోలుకుంటున్న టీడీపీ కార్యకర్త కిల్లి రమణను టీడీపీ నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాద్ పరామర్శించి ఐదు వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డి సన్యాసినాయుడు, రెడ్డి రాము, ముర్రు గంగునాయుడు, కె.గుర్రన్న, బొడ్డు కృష్ణ, జి.అర్జున, గొర్లి గణేష్, పాతాళం ఎర్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మా ప్రేమ ఫౌండేషన్ అధినేత జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కశింకోట: మా ప్రేమ ఫౌండేషన్ అధినేత తోట ముకుంద జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా నరసంగపల్లి మాజీ సర్పంచ్ మజ్జి సూర్యప్రకాశరావు, చింతలపాలెం సర్పంచ్ కొట్టే రాము పూలమాల వేసి శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. స్వాములకు పది రోజులకు సరిపడగా నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెర్రిపోతుల నూకు నాయుడు, మజ్జి వరకృష్ణ, కోన కృష్ణ, మజ్జి వెంకటసురి, మారిశెట్టి చిరంజీవి, పిల్లా రాజు, మునగపక గోవింద, విజయ్, మణికంఠ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విశాలాంధ్ర - యలమంచిలి రూరల్: యలమంచిలి-అనకాపల్లి జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ని ఢీకొట్టింది. ఈ ఘటనలో కొక్కిరాపల్లికి చెందిన భీమిని సాయికిరణ్‌కు తీవ్ర గాయలవ్వగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల అనుపు ఉత్సవం

విశాలాంధ్ర - కె.కోటపాడు: మండల కేంద్రం గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గౌరీ పరమేశ్వరుల అనుపు ఉత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ప్రతి యేటా నాగులచవితి రోజున ఈ ఉత్సవం చేయటం అనవాయితీ. ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, గ్రామ సర్పంచ్ రెడ్డి అరుణ ఆధ్వర్యంలో గ్రామంలోని కులాల వారీగా 11 భారీ స్టేజీలు ఏర్పాటు చేసి పలు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని అన్ని వీధులలో అమ్మవారిని ఊరేగించి బాణసంచా, తప్పిట గుళ్ళు. మహిళల చిడతలు మొదలగు కార్యక్రమాలు నిర్వహించి గౌరీ పరమేశ్వరుల నిమజ్జనం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో గౌరీ పరమేశ్వర సేవా సంఘం సభ్యులతోపాటు గ్రామ ప్రజలు, పెద్దలు పాల్గొన్నారు.

పోతులూరి ఆరాధన ఉత్సవాలు

విశాలాంధ్ర - నాతవరం: మండల కేంద్రంలో శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన ఉత్సవాలలో భాగంగా కంచి కామాక్షి సంఘం వారి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మర్రిపాలెం గ్రామానికి చెందిన శ్రీ శిరిడి సాయి భజన బృందం వారిచే హరి భజన నిర్వహించారు. ఈ కార్య క్రమంలో లక్కోజు విక్రమ్, ఒంపోలు వీర్రాజు, కేశంకుర్తి సత్యనారాయణ, ఇనుకపల్లి సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు తనూజ

విశాలాంధ్ర - పాయకరావుపేట: ప్రకాశం జిల్లా సింగరాయకొండలో ఈనెల 23, 24 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీల్లో స్థానిక శ్రీప్రకాష్ విద్యా నికేతన్‌లో 10వ తరగతి చదువుతున్న కర్రి తనూజ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఎంపికైన తనూజ ఈనెల 31 నుండి 5రోజులపాటు కర్నూలులో జరిగే శిక్షణలో పాల్గొని, నవంబర్ 8 నుండి 11తేదీ వరకు పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుంది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన తనూజను విద్యాసంస్థల అధినేతలు సీహెచ్‌విికె నరసింహారావు, సీహెచ్ విజయ్‌ప్రకాష్, ప్రిన్సిపాల్ ఎంవివిఎస్ మూర్తి, హెచ్‌ఎం డివి శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు అంజి, శివాజి తదితరులు అభినందించారు.

3 నుంచి నోవాటెల్‌లో సూత్రా ఎగ్జిబిషన్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విస్తృత శ్రేణి డిజైనర్స్ ఫ్యాషన్లను ముందుకు తెచ్చే సూత్రా ఎగ్జిబిషన్ నవంబర్ 3, 4 తేదీలలో హెూటల్ నోవెటాల్‌లో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గృహ అలంకరణ వస్తువులు, వివాహాది శుభకార్యాలకు అవసరమైనవి, పెద్ద సంఖ్యలో ఫర్నీచర్, హెూమ్ ఫర్నీషింగ్స్, రియల్ జ్యుయల్స్ (డైమండ్స్ జ్యుయలరీ) మనసును దోచే వేలాది రకాలతో అన్నింటిని ప్రదర్శించనున్నట్టు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటలు వరకు ఈ వస్త్ర ప్రదర్శన అమ్మకాలను సూత్రా ఏర్పాటు చేసిందన్నారు.

2న ఫ్యూజన్ మైక్రో ఫైనాన్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఫ్యూజన్ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ తమ తొలి పబ్లిక్ ఆఫరింగ్‌ను నవంబర్ 02న తెరువనుంది. ఈ ఆఫర్‌లో భాగంగా ఒక్కోటి 10 రూపాయల ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నారు. తాజాగా 6 వేల మిలియన్ రూపాయల షేర్లను జారీ చేస్తే, 13,695,466 ఈక్విటీ షేర్లను విక్రయానికి అందుబాటులో ఉంచనున్నారు. యాంకర్ ఇన్వెస్టర్లు నవంబర్ 01, 2022న తమ బిడ్డింగ్ దాఖలు చేయవచ్చు. ఈ ఆఫర్ నవంబర్ 04,2022న ముగుస్తుంది.

ఘనంగా శారదా పీఠాధిపతి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పెందుర్తి: విశాఖ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర స్వామి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ, రక్తదాన శిబిరం, అన్న సమారాధన తదితర సేవలతో పాటు, ఉదయం నుండి పీఠం ఆవరణలో హెూమం, జపం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా పార్టీ మాజీ అధ్యక్షులు శరగడం చిన్న అప్పలనాయుడు దంపతులు స్వరూపానంద స్వామిని గజమాలతో సత్కరించి ఆయన ఆశీస్సులు అందుకున్నారు. మంత్రులు అంబటి రాంబాబు, కే. నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, 95 వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, జిల్లా కలెక్టర్ మల్లికార్జున్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వరూపానందకు శుభాకాంక్షలు తెలియజేశారు.

2 నుంచి ఏకలవ్య పిజిటి, టిజిటి ఉపాధ్యాయుల ఎంపికకు డెమో

విశాలాంధ్ర - పాడేరు: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో అతిథి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిందని, నవంబర్ 1,2,3 తేదీలలో డెమో నిర్వహించి పోస్టులను భర్తీ చేయటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలి పారు.

ధ్రువపత్రాల పరిశీలన అనంతరం 366 మంది అభ్యర్థులు డెమోకు అర్హత సాధించారని, వీరికి స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న ఎ.పి రెసిడెన్షియల్ పాఠశాలలో డెమో నిర్వహిస్తామని తెలిపారు. నవంబర్ 1న పిజిటి అన్ని కేటగిరీలతో పాటు టిజిటి తెలుగు, ఆంగ్లం, రెండవ తేదీన టిజిటి ఆంగ్లం, లెక్కలు, సైన్సు, సోషల్ విభాగాలకు డెమో నిర్వహిస్తామని తెలిపారు.

డెమోకు అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను itdapaderu.ap.gov.in, aptribes. ap.gov.in అనే వెబ్ సైట్‌లో కూడా పొందుపరిచామని తెలిపారు.

అర్చక సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ బుద్ధ లక్ష్మీ నగేష్

విశాలాంధ్ర - అనకాపల్లి: జిల్లాలోని అర్చకుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు జిల్లా దేవాదాయ శాఖ అధికారి బుద్ధ లక్ష్మీ నగేష్ తెలిపారు. గురువారం దేవాదాయ శాఖ కమిషనరుతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేసినట్లు తెలిపారు. వంశపారంపర్య అర్చక నమోదు కొసం ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని, వాటిపై విచారణ జరిపి డిసెంబర్ 31 నాటికి ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. అర్చకులకు ఇళ్ళ స్థలముల మంజూరు, రైతు భరోసా, రెవెన్యూ అడంగల్ నందు సాగుదారు క్రింద అర్చకుల పేరు నమోదు, ఆరోగ్య శ్రీ కార్డులు మంజూరు తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని అదృశ్యం

బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న పాఠశాల సిబ్బంది

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: ఆశ్రమ పాఠశాలలో కొలు వుంటూ విద్యనభ్య సించే విద్యార్థిని, విద్యార్థుల యోగక్షేమాలను చూడవలసిన పాఠశాల సిబ్బంది బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రంలో గల బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న సాకేరి సమీరా (12) అనే గిరి విద్యార్థిని ఐదు రోజుల క్రితం అదృశ్యమైంది. తమ కుమార్తెను దీపావళి పండుగ అయిన వెంటనే పాఠశాలకు పంపించామని, ఐదు రోజుల క్రితం నుంచి అదృశ్యమైతే తమకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని తల్లిదండ్రులు సిబ్బందిని ప్రశ్నించారు.

డిప్యూటీ మేట్రిన్, ప్రధానోపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె అదృశ్యమైనట్టు వాపోతున్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలి

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో ప్లాస్టిక్ కవర్ల నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని వైస్ ఎంపీపీ వన్ వి.సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ సుభాష్ చంద్ర, పంచాయతీ కార్యదర్శి గోపి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు వాడటం వల్ల కాలుష్యం పెరిగిపోతుందని అన్నారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగించిన వారిపై జరిమానాలు విధిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నాడు -నేడు పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - హుకుంపేట : మనబడి నాడు -నేడు పథకం ద్వారా పాఠశాలలు రూపురేఖలు మారిందని ఎస్టికమిషన్ సభ్యురాలు జంపారంగి లిల్లీ అన్నారు. శనివారం స్థానిక కేజీబీవీలో పాఠశాలలో 52లక్షల రూపాయల వ్యయంతో నమనబడి నాడు నేడు పథకం ద్వారా జరుగుతున్నా నిర్మాణం పనులకు ఆమె స్థానిక ఎంపీపీ రాజుబాబు, జడ్పీటీసీ మత్యలింగం తొ కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సమిడి వెంకట పూర్ణిమ, వైఎస్ఆర్ సీపీ పార్టీ సోషల్ మీడియా జిల్లా కో కన్వీనర్ టి సురేష్ ,మండల అధ్యక్షులు కొండబాబు , ప్రధానోపాధ్యాయులు జయప్రద, మండల పార్టీ నాయకులు సత్తిబాబు, సదాశివరాజు, అనిల్ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

విశాలాంధ్ర -పాడేరు: భక్తి శ్రద్ధలతో నాగుల చవితి నాగదేవతకు భక్తులు పూజలు చేసి నాగదేవత ఆశీస్సులు పొందారు. శనివారం నాగుల చవితి సందర్భంగా భక్తులు పుట్టలో పాలు పోసి కోడిగుడ్డు నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక సబ్ కలెక్టర్ వి అభిషేక్ నాగదేవతకు ప్రత్యేక పూజలు చేసి పుట్టలో పాలు వేసి నైవేద్యాలను సమర్పించి నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాతవరం: నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నాతవరం మండలంలోని నాతవరం, గుమ్ముడుగొండ, ఎంబి.పట్నం, శృంగవరం, మర్రిపాలెం తదితర గ్రామాల్లో భక్తిశ్రద్ధల నడుమ నాగుల చవితి పర్వదినంను ప్రజలు

జరుపుకున్నారు. తెల్లవారుజాము నుండి ప్రజలు పొలాల బాట పట్టారు. పొలాల్లోని పుట్టల్లో నాగేంద్రునికి గుడ్లు, పాలు, చిమ్మిలి, చలివిడి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో శనివారంనాడు ఘనంగా నాగులచవితిని జరుపుకున్నారు.నాగుల చవితి

సందర్భంగా రాంబిల్లి టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు వసంతవాడ దిన్ బాబు తన కుటుంబ సభ్యులతో కలిసి పంచదార్ల గ్రామంలో పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

కొయ్యూరు : నాగుల చవితి పర్వదినాన్ని మండల వ్యాప్తంగా భక్తులు శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా

జరుపుకున్నారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి ఆమె భర్త శివప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి నాగుల చవితి సంబరాల్లో పాల్గొని పుట్టలో పాలు పోశారు. మండల వ్యాప్తంగా భక్తులు గ్రామ పరిసరాల్లో రైతులు పంటపొలాల్లో పుట్టలను శుభ్రపరిచి నాగేంద్రునికి పాలు గుడ్లు, చిమ్మిలి వంటి నైవేద్యాలను సమర్పించి పూజలు నిర్వహించారు. రేయిం బవళ్లు పొలాలు పుట్టలు అడవులు వెంట తిరిగే తమను తమ పిల్లాపాపలతో పాటుగా పశు సంపదను కాపాడాలని వేడుకంటూ నాగేంద్రునికి మొక్కులు చెల్లించారు. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుపై అవగాహన

విశాలాంధ్ర - అనంతగిరి: ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా కొత్తవలస, ఎస్.కోట, అరకు, పాడేరులోని వివిధప్రాంతాలలో ఏయు విద్యార్థి నాయకుడు, ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ సందర్శించి అవగాహన కల్పించారు. ఉత్తరాంధ్ర పట్టబద్రులందరూ నవంబర్ 7 లోపు నమోదు చేసుకోవాలని అన్నారు. ఓటరు నమోదు చేసుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆయన కోరారు.

నిరుద్యోగ యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక వలస కూలీలుగా పోతున్నారని ఈ వలసలు ఆపాలంటే ఆర్టికల్ 371 డి ప్రకారం స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగాల్లో 75% రిజర్వేషన్ కల్పిస్తే వలసలు ఆగుతాయని ఆయన అన్నారు. తక్షణమే రాష్ట్రంలో ఉన్న అన్ని ఉద్యోగ ఖాళీలు భర్తీ చేసి, ఉద్యోగ వయోపరిమితి పెంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సమయం హేమంత కుమార్, రూప, నాగలక్ష్మి, రాజశ్రీ శాంతా శాస్త్రి, ధన్వి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోండి

- డీఆర్వో దయానిధి

విశాలాంధ్ర -పాడేరు: 2022 నవంబర్ 1వ తేదీ నాటికి డిగ్రీ ఉత్తీర్ణులై మూడేళ్ళు పూర్తి చేసిన వారందరూ నవంబర్ 07వ తేదీలోగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి బి.దయా నిధి ఒక ప్రకటనలో తెలిపారు. గడువు తేదీ సమీ పిస్తున్నందున త్వరగా నమోదు చేయించుకోవాలని కోరారు. అర్హులందరూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఫారం 18 పూరించి పాస్ పోర్ట్ సైజ్ ఫోటో అతికించి, డిగ్రీ పాసైన ధృవపత్రం జెరాక్స్ ప్రతి జతపరచి నివాస ఆధారంగా సంబంధిత మండల కార్యాలయంలో అందజేయాలని డిఆర్ఓ వివరించారు. అదే విధంగా ఫారం 18లో శాసన సభ ఎన్నికల ఓటరు జాబితాలో ఉన్న దరఖాస్తు దారుని వివరాలు పొందుపరచాలని సూచించారు. ఓటరు నమోదు అధికారికి దరఖాస్తు అందజేసిన తరువాత తప్పనిసరిగా రశీదు పొందాలని డిఆర్ఓ సూచించారు. www.ceoandhra.nic.in అనే వెబ్ సైట్ నందు ఆన్లైన్‌లో కూడా ధరఖాస్తు చేసుకోవచ్చని డిఆర్ఓ తెలిపారు. జిల్లా ప్రధానాధికారులు అర్హత కలిగిన వారి కింది స్థాయి సిబ్బందితో ఓటర్ ఎన్రోల్మెంట్ చేయించాలని డిఆర్ఓ కోరారు. అదేవిధంగా అన్ని సచివాలయాలలో అర్హులైన సిబ్బంది కూడా ఓటరు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఓటరు నమోదుతో మంచి వ్యక్తిని ప్రజా ప్రతినిధిగా ఎన్నుకోవచ్చని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే, ఎంపీపీ చర్చలు

విశాలాంధ్ర - అనంతగిరి: అరకులోయ నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల ద్వారా మంజూరైన పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీపీ శెట్టి నీలవేణిలు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కోరారు. గ్రామాల్లో పర్యటించి అక్కడ సమస్యలను తెలుసుకొని పనులను ప్రతిపాదించారని ఇప్పటికే ప్రతిపాదించిన ప్రతి పనికి అడ్మినిస్ట్రేషన్ సాంక్షన్ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. పనులను తక్షణమే ప్రారంభించి పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాల్గుణతో అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి కోఆప్షన్ సభ్యుడు షేక్ మదీనా కలెక్టర్‌ని కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. గడపగడపకు నిధులతో పాటు ఎమ్మెల్యే కోటాలో నియోజకవర్గానికి రెండు కోట్లు పనులు ప్రారంభించేందుకు అనుమతులు వచ్చాయని ఈ మేరకు పనులు ప్రతిపాదించి పంపాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కోటిన్నర రూపాయలతో రహదారుల నిర్మాణాలకు 50 లక్షలతో తాగునీటి పథకాలకు ప్రతిపాదనను పంపాలని ఎమ్మెల్యేకి జిల్లా కలెక్టర్ సూచించారు.

బొర్రా గుహలు ఆదాయంలో పంచాయతీ వాటాను విడుదల చేసేందుకు టూరిజం అధికారులతో మాట్లాడానని త్వరలోనే నిధులు విడుదల అవుతాయని కలెక్టర్ వివరించారు.